

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 14 జూన్ 2024

ఎన్నికల సమయంలో ప్రజలందరికీ ఇచ్చిన హామీలను అధికార పగ్గాలు చేపట్టిన కొద్ది గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చడం ఆరంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువత ఎన్నాళ్ళుగానో ఆశిస్తున్న, ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం పడింది. వైసీపీ హయాంలో జనం భూములపై కన్నేసి చట్టం తీసుకొచ్చి మాయం చేద్దామనుకున్న మోసగాళ్ళకు చెక్ పెడుతూ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. పేద వర్గాలకు పింఛన్ నాలుగు వేలకు పెంచుతూ మరో సంతకం చేశారు. పేదోడి కడుపు నింపేలా అన్న క్యాంటీన్ల పునః ప్రారంభానికి వీలు కల్పిస్తూ ఒక సంతకం, స్కిల్ సెన్సెస్ పేరిట యువతలో డవలప్‌మెంట్‌కు వీలుగా మరో సంతకం పూరించారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంపై జనామోదానికి దారితీశాయి.



అమరావతిలో సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

# పాంచ్ పటాకా

## మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు

- నిరుద్యోగుల్లో కొండంత ఆశలు
- మెగా డీఎస్సీపై తొలి సంతకం
- పేదలకు పింఛన్ మిఠాయిలు
- ఇక పేదోడి కోసం అన్నక్యాంటీన్లు
- టైటలింగ్ యాక్ట్ రద్దుతో జనామోదం
- కూటమిపై ప్రశంసల జల్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడిచిన ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్టుగా తలపడి ప్రజామోదంతో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి కొద్ది గంటల వ్యవధిలోనే ప్రజామోద నిర్ణయాలు తీసుకోవడం ఆరంభించింది. గత ఐదేళ్లుగా ఉద్యోగ కల్పన లేక, అవకాశాలు రాక, వయోభారం పెరిగి తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీలో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం చేయడంతో నిరుద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి అనుగుణంగా తొలి సంతకం చేయడంతో నిరుద్యోగులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లాల వారీగా భర్తీ చేయనున్న టీచర్ పోస్టులను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఇప్పటికే చాన్నాళ్ళుగా బీఈడీ పట్టాలు అందుకున్న వేలాది మంది ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులను ఊరించే దిశగా డీఎస్సీ ప్రకటించింది. కాని ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడం, వైసీపీ ఓట్ల కోసమే ఈ నాట కం ఆడిందంటూ కూటమి సహా మిగతా పార్టీలు విరుచుకు పడ్డాయి. నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాము అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపైనే తొలి సంత కం చేస్తానంటూ చంద్రబాబు తాను చేసిన వాగ్దానాన్ని గురు వారం నిలబెట్టుకున్నారు. ఇప్పటికే అనేక పాఠశాలల్లో ఏకోపాధ్యాయుల ఆధీనంలోనే ఉన్నాయి. చాన్నాళ్ళుగా సర్దు బాటు, దిద్దుబాటు లేక వెనుకబడ్డాయి. ఈలోపే ఎయిడెడ్ స్కూళ్ళను సర్కార్ పాఠశాలల్లో విలీనం చేసినా టీచర్ల కొరత మాత్రం యథావిధిగా కొనసాగుతూనే వచ్చింది. దీనికితోడు విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు క్షీణిస్తున్న తరుణంలోనే విద్యార్థు లను ప్రోత్సహించడం, సమాంతరంగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయడానికి చంద్రబాబు నేతృత్వాన కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 నుంచి 600 వరకు ఖాళీలు భర్తీ అయ్యే అవకాశాలు లేకపోలేదు.

### ఇక పింఛన్.. నాలుగు వేలు

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నెలవారీ పింఛన్ మూడు వేలకుపైగా చేస్తామని అప్పట్లో టీడీపీ హామీ ఇచ్చింది. ఆ తర్వాత క్రమేపీ పింఛన్ పెంచుతూ వెళ్ళారు. జగన్ ప్రభుత్వ పాలనలో మాత్రం పింఛన్ అరకొరగా పెంచడంతో వృద్ధులు, వికలాంగులు నిరాశకు గురయ్యారు. జిల్లావ్యాప్తంగా 2 లక్షల 80 వేలకుపైగా పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరికీ లబ్ధి చేకూర్చేలా నెలకు నాలుగు వేల పింఛన్ ఇచ్చేలా చంద్రబాబు మరో నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. వయో వృద్ధుల దగ్గర నుంచి పేద వర్గాలందరికీ ఇది ఆపద్బంధు పథకం. పింఛన్ నాలుగు వేలు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చినప్పుడు ఇదంతా ఎన్నికల నాటకమని వైసీపీ ప్రజలను తికమకపెట్టే ప్రయత్నం చేసింది. దీనికితోడు ఎన్నికల సమయంలో పింఛన్ సొమ్ములను బ్యాంకు ఖాతాల్లో వేసి అనేక మంది మరణానికి కారణమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు వెనక్కి తగ్గకుండా కూటమి పక్షాన తమ మాటల నిలుపుకుంటామని పదేపదే ప్రకటించి ఇప్పుడు ఆ వాగ్దానాన్ని అధికార పగ్గాలు చేపట్టిన కొద్ది గంటల్లోనే నెరవేర్చుకున్నారు. వీటన్నింటితోపాటు యువకుల్లో నైపుణ్యం పెంచే దిశగా స్కిల్ సెన్సెస్ పేరిట మరో స్కీంపై సంతకం చేశారు. ఇది కూడా యువతకు భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పించేందుకే.

### ల్యాండ్ టైటలింగ్ రద్దు

సామాన్యులే కాదు రైతుల గొంతు నొక్కేలా గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్టు అమలులోకి తెచ్చింది. భూమి యజమాని ప్రమేయం లేకుండానే అలవోకగా హక్కులు కోల్పోవడం, ఆయా భూములు పరులపరం కావడానికి ఆస్కారం ఉన్న ల్యాండ్ టైటలింగ్ యాక్టు తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చేసిన వాగ్దానానికి అనుగుణంగానే చంద్రబాబు మరో సంతకంతో నెరవేర్చుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భూమి అంటే ప్రాణపదంగా ఉన్న వారంతా గతంలో జగన్ ప్రభుత్వ అరాచక చట్టంపై నేరుగా విరుచుకుపడుతూ కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీ ఇచ్చారు. ఈ దిశగానే వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా టైటలింగ్ యాక్టు రద్దు చేస్తామని నిర్ణయం తీసుకోవడంతో రైతులు, సామాన్యుల్లో సంతోషం వెల్లివిరిసింది. వైసీపీ ఓటమికి ప్రధాన కారణాల్లో ల్యాండ్ టైటలింగ్ యాక్టు ఒకటి కావడం విశేషం.

### అన్న క్యాంటీన్‌లకు మహర్దశ

గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేద వారి కోసం నామమాత్రపు ధరకు టిఫిన్, భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాకా ఈ క్యాంటీన్లపై జగన్ ప్రభుత్వం కన్నెర్ర చేసి మూసివేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. అనంతరం కొద్దిరోజులకు వాటిలో చాలా వాటిని సచివాల యాలుగా మార్చారు. కొన్నిచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పుడు తిరిగి అన్న క్యాంటీన్‌లను ఏర్పాటుచేసేందుకు సీఎం చంద్రబాబు సంతకం చేయడంతో పేద వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

### బాబు కాదు జనం గెలిచారు

ఇచ్చిన హామీలను ఆర్థిక భారమే అయినా ఖాతరు చేయకుండా నేరుగా నెరవేర్చుకున్న కూటమి ప్రభు త్వాన్ని యువత, రైతులు, వయోవృద్ధులు వెయ్యినోళ్ళ కీర్తించారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రిగా ఈ ఐదు పథకాలపై సంతకం చేసిన వెంటనే గ్రామాల్లో కూడా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. కూటమి కేడర్ చాలా చోట్ల సంబరాలు చేసుకుంది.

### అన్నక్యాంటీన్‌తో కడుపు నింపుకున్నాం



గతంలో రూ.5లకే నాణ్యమైన భోజనం చేశాం. తద్వారా ఎంతో ఆనందించాం. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా క్యాంటీన్‌లు మూసివేసి మా పొట్టకొట్టింది. ఆ సమయంలో కడుపునింపేందుకు నానా అవస్థలు పడ్డాం. టీడీపీ రాకతో క్యాంటీన్‌లు పూర్వ వైభవం వస్తుంది. మా కడుపు నిండుతోంది.

– పెద్దింటి పాపారావు, ఏలూరు

### చంద్రబాబు వృద్ధుల పాలిట దేవుడు



సీఎం చంద్రబాబు వృద్ధుల పాలిట దేవుడు. ఈ వయస్సులో ఏ పని చేయలేం. పింఛన్ రూ.4 వేలకు పెంచడం ఆనందంగా ఉంది. ఇప్పుడు ఎవరి సాయం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి లేదు.

– గెద్దాల అప్పారావు, శనివారపుపేట

### వృద్ధులకు భరోసా ఇచ్చారు



వృద్ధుల సంక్షేమానికి చంద్రబాబు ప్రాధాన్యం ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో వృద్ధులను పట్టించుకున్న పాపాన పోలేదు. రూ.3 వేలు ఏ మూలకు వచ్చేవి కావు. చంద్రబాబు నాలుగు వేలు పింఛన్ ఇస్తామని, సంతకం చేయడం సంతోషంగా ఉంది. మా కుటుంబం చింతలేకుండా ఉండొచ్చు.

– చింతలపూడి ఇందిరాదేవి, ఏలూరు

### రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన



జగన్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడికే ల్యాండ్ టైటిలింగ్ అంటూ ఒక చట్టాన్ని గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఆ చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజునే రద్దు చేస్తూ సంతకం చేయడం హర్షణీయం. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు బీజం పడింది.

– బొప్పన సుధాకర్, రైతు, బాపిరాజుగూడెం

### మా భూములకు రక్షణ..



రైతుల భూములను కొల్లగొట్టడానికి జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో మా భూములు భవిష్యత్‌లో మావి కావేమోనని భయపడ్డాం. కూటమి ఆధ్వర్యంలో సీఎంగా చంద్రబాబు తొలిరోజునే యాక్టు రద్దుపై సంతకం చేయడం ఊరటనిచ్చింది. మా భూములు ఇక ఎక్కడికి పోవు.

– తాతా సత్యనారాయణ, రైతు, పెదవేగి.

### పోరాటాల ఫలితమే మెగా డీఎస్సీ



మెగా డీఎస్సీ అంటూ ఐదేళ్ల కిందట జగన్‌రెడ్డి ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మిన జనం.. జగన్‌కు ఓటేశారు. దానికి ప్రతిఫలంగా ఐదేళ్లకల నిరీక్షణతోనే ప్రజలు గడిపారు. ఏటా జనవరిలో జాబ్ కేలండర్ అన్నారే కానీ ఒక్క కేలండర్ కూడా తీసిన పాపానపోలేదు. కానీ చంద్రబాబు సీఎంగా పాలన చేపట్టిన తొలిరోజునే తొలి సంతకమే మెగా డీఎస్సీపై పెట్టడం నిరుద్యోగ యువతకు ఊపిరి పోసింది. రాష్ట్రంలో నూతన అధ్యాయానికి తొలి అడుగు పడింది. ఇక రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయి.

– యిప్పిలి వెంకటేశ్వరరావు, దెందులూరు

(ఏలూరు రూరల్/పెదవేగి)




## ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో న్యాయవాదుల హర్షం

ఏలూరు క్రైం, జూన్ 13 : ప్రజల ఆస్తులకు రక్షణ లేని చట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేయడం పట్ల ఏలూరు బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు చట్టం రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడంతో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న న్యాయవాదుల సంఘాలు అనేక నెలలు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపి ఆ చట్టాన్ని వ్యతిరేకించారు. నూతన సీఎం చంద్రబాబు ఆ చట్టాన్ని గురువారం రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారని, న్యాయ వాదుల పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. చట్టాన్ని రద్దు చేసిన చంద్రబాబుకు ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పిడి దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ నక్కా నాగరాజు, జాయింట్ సెక్రటరీ గొర్రెల సతీష్ కుమార్, నోముల రాముడు, కల్చరల్ సెక్రటరీ తిగిరిపల్లి సుబ్బారావు, న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, పక్కన ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యేలు రోషన్, చంటి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని

## సమస్య మీది.. పరిష్కారం మాది

- సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం
- ప్రజారంజక పాలన సాగిస్తాం
- మీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి

ఏలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి):జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, అందరి సహకారంతో ప్రజారంజక పాలన అందిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులందరం సమైక్యంగా, సమష్టిగా ప్రజలు కోరుకున్న విధంగా అడుగులు వేస్తామన్నారు. ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, రోషన్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లుగా అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. ప్రజా వ్యతిరేక పాలన సాగింది. దీని నుంచి ఒడ్డెక్కేందుకే కూటమి ప్రభుత్వాన్ని అత్యంత మెజార్టీతో గెలిపించుకున్నారు. దీనికి ప్రజలకు రుణపడి ఉంటాం. ఇంతకుముందు ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు నష్టపోయారు. సామాన్య ప్రజలు జీవనం దెబ్బ తింది. వీరంతా కూటమి పక్షాన నిలిచారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి తీరుతాం. ప్రతీ విషయంలోనూ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పోలవరం పూర్తి చేస్తామన్న హామీని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఆక్వా రైతులు గడిచిన ఐదేళ్ళల్లో అష్టకష్టాలకు గురై నష్టం చవిచూశారు. వారిని ఆదుకుంటాం. ప్రజా సంక్షేమమే తొలి ప్రాధాన్యత. అంతేగాని వేధింపులకు అవకాశం లేనేలేదు. పోలవరం, కొల్లేరు, చింతల పూడి ఎత్తిపోతల, పామాయిల్, మామిడి రైతుల సమస్యలన్ని పరిష్కరిస్తాం.' అంటూ మంత్రి స్పష్టం చేశారు.

### మాది సమష్టి బాధ్యత : గన్ని

జిల్లాలో అభివృద్ధి చేసి చూపిస్తామని, సమస్యల పరిష్కారం దిశగా పయనిస్తామని, మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ మహేష్, ఎమ్మెల్యేలంతా సమష్టిగా కష్టపడి పనిచేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి అనుగుణంగానే ప్రతీ చర్య ఉంటుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, రోషన్‌కుమార్, మాజీ మంత్రి మరడాని రంగారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, పుప్పాల జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం

పెదవేగి, జూన్ 13 : గాలివాన బీభత్సంతో పెదవేగి మండలంలో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం మబ్బులు కమ్మి ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి, ప్రజలు అవస్థలు పడ్డారు. ఏలూరు-చింతలపూడి ప్రధాన రహదారిపై జానంపేట దగ్గర రహదారిపై భారీవృక్షం కూలడంతో రాకపోకలు స్థంభించి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. భారీవృక్షాన్ని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.



జానంపేట వద్ద కూలిన భారీ వృక్షం

## 29న జాతీయ లోక్‌అదాలత్




- జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీగ్రేస్‌కుమారి

ఏలూరు క్రైం, జూన్ 13 : జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి అన్నారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ భవనంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మీడియాతో మాట్లాడారు. ఈనెల 29వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు లావాదేవిల కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్‌కు సంబంధించిన ఈపీలను, ప్రిలిటికేషన్ కేసులను ఈ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తారన్నారు. రాజీయోగ్యమైన కేసులకు సంబంధించి ఇరువైపులా వారికి ఏలూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలోని పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరిస్తారని వివరించారు. ఇతర ప్రాంతాల్లో నివసించే వారితో ఆన్‌లైన్‌లో చర్చించి కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### సుప్రీంకోర్టులో పెండింగ్ కేసులకు నోటీసులు జారీ

సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న జిల్లాకు సంబంధించిన 15 కేసులు రాజీ చేయడానికి వారికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. సుప్రీంకోర్టులో జులై 27వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని ఈ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన కేసులను గుర్తించి సంబంధిత కోర్టుల ద్వారా కక్షిదారులకు నోటీసులు జారీ చేశారన్నారు. జిల్లాలో 15 కేసులు రాజీయోగ్యమైనవి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్‌ల కోసం ఏలూరు లోక్‌అదాలత్ భవనానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేశారన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు వృథా కాదని సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు.

# ధాన్యం సొమ్ము ఏమైంది?

- ఉమ్మడి పశ్చిమలో రూ.1100 కోట్లకు పైగా బకాయి
- ఎన్నికల సమయంలో కాంట్రాక్టర్లకు ఇచ్చి రైతులకు దగా
- ఏప్రిల్ నెలాఖరు తరువాత ఒక్కపైసా రైతు చేతికి అందలేదు
- అడిగేవారే గాని.. చెప్పేవారు లేరు..
- బాబు దయ తలిస్తేనే ఖరీఫ్ సాగు : రైతుల వేడుకోలు




(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రూపాయి కాదు రెండు రూపాయలు కాదు ఏకంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి అక్షరాలా సర్కారు బకాయి పడింది రూ.1100 కోట్లు. సరిగ్గా ఎన్నికల సమయంలో ఏప్రిల్ నెలాఖరున ఉన్న సొమ్మంతా కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేసి ఖజానా ఖాళీ చేసి అన్నదాతకు ఇవ్వాల్సిన బకాయిలు అప్పటి జగన్ ప్రభుత్వం గాలికొదిలేసింది. తమను ఆదుకోవాలని, వచ్చే ఖరీఫ్ సీజన్ అవసరాలకు తగిన సొమ్ము ఉంటేనే ముందుకు వెళ్తామని, పరిస్థితి అర్థం చేసుకోవాలంటూ వేడుకున్నా దిక్కుమొక్కులేదు. ఇప్పుడేమో సర్కారు చెల్లించాల్సిన బకాయి కాస్తా వందల కోట్లకు చేరింది. ఈ సొమ్ము అంతా రైతు చేతికి ఎప్పుడు చేరుతుందో సమాధానం చెప్పేవారే లేరు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు జోక్యం చేసుకుంటేనే తాము ఒడ్డెక్కుతామని రైతుల ఘోషిస్తున్నారు.

### ఇంత బకాయి ఎందుకు ?

ఈ రబీ సీజన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 7.20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఇంతకుముందు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకే అధికారులను రంగంలోకి దింపింది. సాధ్యమైనంత మేర ధాన్యం కొనుగోళ్ళల్లో వేగవంతం చేయాలంటూ లక్ష్యాలను చేరుకునేందుకు హడావుడి చేశారు. కాని రైతులకు ఎప్పటికప్పుడు ఇవ్వాల్సిన కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు పక్కన పెట్టేశారు. ఇవాళ కాకపోతే రేపైనా ప్రభుత్వం చెల్లించక పోతుందా అనే ఆశతోనే రైతులు ఇన్నాళ్లు ఓపిక పట్టారు. దీనికితోడు ఎన్నికల సమయం కాబట్టి నిధులు మంజూరు సాధ్యం కావడం లేదని ఇంకొందరు మభ్యపెట్టారు. రైతుల నుంచి దాదాపు ఏడు లక్షల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించాల్సిన ఉండగా నిర్దేశించిన తేదీ నాటికి కేవలం 6 లక్షల 30 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. దఫాల వారీగా రైతుల ఖాతాల్లోకి సుమారు 400 కోట్లకు పైగా చెల్లించగలిగారు. ఈలోపే అధికార యంత్రాంగం యావత్తు ఎన్నికల నిర్వహణలో పడిపోవడంతో ధాన్యం సేకరణ, రైతుకు అందాల్సిన బకాయిలపై సమీక్షించకుండా గాలికొదిలేశారు. ఈ నేపథ్యంలోనే ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే రూ.850 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.250 కోట్లు ప్రభుత్వం రైతులకు బకాయిపడింది. ఏప్రిల్ 28 తర్వాత ఈ మొత్తంలో రూపాయి కూడా చెల్లించే సాహసం చేయలేక పోయారు. ఎలాగూ సర్కారు కూలిపోతుంది కాబట్టి రైతుల పట్ల అప్పటివరకు కపట ప్రేమ నటించిన వైసీపీ ప్రభుత్వం వీరందరినీ నేరుగా నట్టేట ముంచింది. ఒక్క ఏలూరు జిల్లాలోనే 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్ళు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని దాదాపు 120 రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. సుమారు 17 వేల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా వారికి చెల్లించాల్సిన సొమ్ము 242 కోట్లకు పైబడే ఉంది. ఈలోపే ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రకరకాల నిబంధనలు తెరమీదకు తీసుకొచ్చారు. వీటన్నింటిపైనా రైతు అనుకూల సంఘాలన్నీ తీవ్రంగా విరుచుకుపడ్డాయి. అయినా ఈ పరిస్థితిని అధికారులెవ్వరూ ఏ మాత్రం ఖాతరు చేయలేదు.

### ఈ ఖరీఫ్ మాటేంటి..

ఇప్పటికే తొలకరి దగ్గర పడుతోంది. ఖరీఫ్ పనులు ఆరంభం కావాల్సి ఉన్నాయి. అయినా ఎన్నికల నిర్వహణలో పడి అందరూ పరిస్థితిని అంచనా వేయడం మానేశారు. ముందస్తుగా చేపట్టాల్సిన ప్రణాళికలను అమలు చేయడానికి అధికారులు శ్రద్ధ పెట్టలేదు. సాగునీటి సరఫరాలో క్రమపద్ధతిని పాటించలేకపోయారు. దీనికితోడు రైతు చేతిలో చిల్లిగవ్వలేని దీనస్థితి. ప్రభుత్వం నుంచి వందల కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నందున ఇప్పటికే అప్పులు తెచ్చిన సొమ్ములకు వడ్డీల కట్టలేక రైతులు విలవిలలాడుతున్నారు. మరి ఖరీఫ్ పనులు ప్రారంభించాలంటే కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు తక్షణం జోక్యం చేసుకుంటేనే తప్ప ఈ ఖరీఫ్ పనులు చేపట్టడం సాధ్యం కాదని రైతులు ఆవేదనతో ఉన్నారు.

### సీఎంతో మాట్లాడి ఆదుకుంటాం..

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రభుత్వం రైతులకు బకాయి పడిన ధాన్యం సొమ్ముల విషయంలో గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం దాగి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ధాన్యం కొనుగోళ్ళు, పెండింగ్ బకాయిలకు సంబంధించి గురువారం ఏలూరులో మీడియా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. రైతు సమస్యలతో పాటు మిగతా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తాం, తగిన పరిష్కారం త్వరలోనే లభిస్తుందన్నారు. రైతులు ఇలాంటి దుస్థితి ఎదుర్కోవడానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని దుయ్యబట్టారు.

## రేపు భీమవరంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

భీమవరం అర్బన్, జూన్ 13: జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ఈనెల 15వ తేదీ శనివారం భీమవరంలోని వంశీనగర్ ఓల్గా ఆర్చరీ ఆకాడమీలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎల్. జయరాజు, కోచ్ సయ్యద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకరులు తమ ఆధార్‌కార్డు, పుట్టిన సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో శనివారం ఉదయం ఏడు గంటలకు భీమవరం ఆర్చరీ సెంటరుకు విచ్చేయాలన్నారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 22న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు 98491 81993 నంబరులో సంప్రదించాలన్నారు.

## వేసవి సెలవుల్లో సృజనాత్మకతకు పదును

▸▸ క్రికెట్ స్టేడియం బొమ్మ తయారు చేసిన విద్యార్థులు



స్టేడియం బొమ్మను అందజేస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, జూన్ 13: వేసవి సెలవు ల్లో సమయాన్ని వృథా చేయకుండా కొందరు విద్యార్థులు సృజనాత్మ కతకు పదునుపెట్టారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థులు ఫణికృష్ణవర్మ, సాయికృష్ణవర్మ క్రికెట్ స్టేడియం మాదిరి తయారుచేసి బొమ్మ, పలు బోధనోపకరణాలను పాఠశాల పునఃప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులకు అందజేశారు. నేటితరం విద్యార్థులకు సరైన ప్రోత్సాహన్ని అందిస్తే అద్భుతాలు చేయగలరని క్రికెట్ స్టేడియంలో అన్ని సౌకర్యాలను పొందుపరుస్తూ ఆరో తరగతి విద్యార్థులు తయారు చేసిన స్టేడియం ఆకర్షణీయంగా ఉంది. పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యాయులు అపర్ణ, శివశంకర్, ఉషశ్రీ, దుర్గ, యశ్విన్, మణి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో 'బడేటి చంటి తాలూకా'

▸▸ టి-20 క్రికెట్ మ్యాచ్‌లో ఏలూరు యువకుల సందడి



ఫ్లకార్డు ప్రదర్శిస్తున్న ఏలూరు వాసి సాయికృష్ణ

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 13: అమెరికాలో యూఎస్ఏ, ఇండియా టీ-20 క్రికెట్ మ్యాచ్ బుధవారం జరిగింది. ఈ పోటీల్లో ఎన్ఆర్ఐలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన పలువురు యువకులు ఆ స్టేడియంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఘన విజయం సాధించిన సందర్భంగా ఏలూరు బడేటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే తాలూకా అంటూ పెద్దఎత్తున ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ సందడి చేశారు. ఫ్లకార్డుతో స్టేడియం చుట్టూ తిరుగుతూ కేరింతలు కొట్టారు. అమెరికాలోని బడేటి చంటిపై ఉన్న అభిమానంతో క్రికెట్ పోటీలకు హాజరై సందడి చేసినట్టు ఏలూరు వాసి వేమూరి సాయికృష్ణ తెలిపారు.

## వాణిజ్య పన్నులశాఖలో అరాచకాలు అరికట్టాలి

ఏలూరు రూరల్, జూన్ 13 : రాష్ట్ర ఆదాయానికి వెన్నెముకగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖలోని కొంతమంది ఉన్నతాధికారులు సాగించిన అరాచకాల వల్ల ఈ శాఖ భ్రష్టుపట్టిపోయిందని, ఈశాఖను కొత్త ప్రభుత్వం ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలైన అధికార వికేంద్రీకరణ సూత్రానికి వ్యతిరేకంగా వాణిజ్యపన్నులశాఖలో అధికారాల కేంద్రీకరణ జరిగిందన్నారు. అన్ని అధికారాలను ప్రధాన కార్యాలయంలోని కొంతమంది అధికారులు తమవద్దే ఉంచుకుని క్షేత్రస్థాయిలో సర్కిల్ కార్యాలయాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలతో కుమ్మక్కై శాఖ పునర్వ్యవస్థీకరణ పేరుతో పక్కదోవ పట్టించిన కొంతమంది ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారని ఆరోపించారు. వీరి చీకటి వ్యవహారాలను వాణిజ్య పన్నుల సర్వీసెస్ అసోసియేషన్ ప్రశ్నిస్తే అక్రమకేసులు బనాయించి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కొత్త ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన సమస్యలను పరిష్కరించి వాణిజ్యపన్నులశాఖలోని అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

## విజయవాడ - కాకినాడ పోర్టు రైలు పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 13 : విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్ళే రైలు (17257) ను తిరిగి పునరుద్ధరణ చేస్తున్నట్లు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఏలూరు మీదుగా వెళ్లే అనేక రైళ్లను రద్దు చేశారు. అయితే విజయవాడ-కాకినాడ పోర్టుకు వెళ్ళే ఈ రైలు ఈనెల 21వ నుంచి ఆగస్టు 15 వరకు, తిరిగి సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకూ మాత్రమే నడుస్తుందని, అనంతరం తదుపరి ఆదేశాలతో రైలు నడుస్తుందని తెలిపారు.

### గోదావరి క్లస్టర్ విశ్వ విద్యాలయానికి

## యాప్షీ ప్రాజెక్టు మంజూరు

▸▸ నన్నయ ఉపకులపతి పద్మరాజు



వీసీ చేతుల మీదుగా ప్రాజెక్టు పత్రాలను అందుకుంటున్న విజయనిర్మల


రాజమహేంద్రవరం, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి (యాప్షీ) గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్టు మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు పి.విజయనిర్మలకు ప్రాజెక్టు పత్రాలను గురువారం వీసీ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులకు తెలిపిన వివరాలివి.. యాప్షీ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి, డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వ విద్యాలయాలకు రూ.10 లక్షల ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. వేస్ట్ టు వెల్త్, పెక్టిన్‌ని అగ్రో- వేస్ట్ నుంచి విలువ జోడించిన న్యూట్రాస్యూటికల్స్‌గా మార్చడం, ఆహారం, ఫార్మా పరిశ్రమలో సంభావ్య అప్లికేషన్ అనే ప్రాజెక్టును రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లుగా నన్నయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్రవిభాగం అధ్యాపకురాలు విజయ నిర్మల, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి. జీవసాంకేతిక విజ్ఞానశాస్త్రం అధ్యాపకుడు టి.జగన్మోహనరావు, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యానవిశ్వవిద్యాలయం జీవరసాయనశాస్త్రం ఆచార్యులు డి.ఆర్.సలోమిసునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



# ఉద్యోగుల నిధి లెక్క లేవి ?

**త**మ భవిష్యత్తు కోసం ప్రభుత్వ ఉద్యోగులు దాచుకొన్న సొమ్ము ఉందో లేదో ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. తాము దాచుకొంటున్న సొమ్ము తమ ఖాతాల్లో ఎంతవరకు జమయ్యాయో లేదో తెలియని పరిస్థితి. నెల వారీగా తమ జీతం నుంచి మినహాయించిన సొమ్ము తమ పీఎఫ్ ఖాతాల్లోకి జమ అవుతోందో లేదో అని ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేలాదిమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు తమ బ్యాలెన్స్ షీట్లు చూసుకొనే ఉద్యోగులు గత ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్ చేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### నాలుగేళ్లుగా విడుదల కాని పీఎఫ్ బ్యాలెన్స్ షీట్స్




**ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఉద్యోగుల వివరాలు**
ఉద్యోగులు సంఖ్య : 7,726
మండలాలు : 48
పీఎఫ్ సొమ్ము పంపే డ్రాయింగ్ అథారిటీల సంఖ్య : 518

- ▸▸ ఉద్యోగి జీతం నుంచి మినహాయించిన సొమ్ముపై ఆందోళన
- ▸▸ ప్రతినెలా సుమారు రూ.3 కోట్ల నుంచి 5 కోట్లు సొమ్ము మినహాయింపు
- ▸▸ నాలుగేళ్లలో సుమారు రూ.240 కోట్ల సొమ్ముకు జమాఖర్చులు నిల్
- ▸▸ బ్యాలెన్స్ షీట్ లేకపోవడంతో రుణ దరఖాస్తులకు అవకాశం లేదు
- ▸▸ పదవీ విరమణ చేసే ఉద్యోగికి దక్కని బ్యాలెన్స్ షీట్స్

నిడమర్రు, జూన్ 13 :

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి జీత భత్యాల నుంచి సుమారు రూ.6 వేల నుంచి రూ. 15 వేల వరకు సొమ్ము మినహాయించబడి సదరు డ్రాయింగ్ అథారిటీ ద్వారా జిల్లా పరిషత్ కార్యాలయంలో గల ప్రావిడెంట్ ఫండ్ విభాగానికి పంపిస్తారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 7,726 మంది ఉద్యోగులకు గత నాలుగేళ్లుగా ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్స్ ఇవ్వలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సుమారు 2020-21, 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఉద్యోగులు.. ఉపాధ్యాయులు, ప్రభుత్వ సర్వెంట్లకు తమ భవిష్యనిధి ఖాతా బ్యాలెన్స్ షీట్లు ఇవ్వకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతినెల కోట్ల రూపాయల సొమ్ము మినహాయింపు..**

ప్రతి నెల ఉద్యోగికి మంజూరైన జీతభత్యాల నుంచి ఆయా డ్రాయింగ్ అథారిటీ వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంత సొమ్ము మినహాయించి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు పంపిస్తారు. ఈవిధంగా పంపబడిన సొమ్ము ఆయా ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలలో జమ చేస్తారు. జమ చేసిన సొమ్ము వారి ఖాతాల్లోకి చేరాలి. ప్రతి ఉద్యోగికి తన సొమ్ము తమ ఖాతాలలో జమ చేయబడుతుందో లేదో అనుమానం ఇక్కడ వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం వారికి తమ ఖాతా బ్యాలెన్స్ షీట్లు ప్రతి ఏడాది ఇవ్వకపోవడమే అని తెలుస్తుంది. ప్రతినెల ఒక ఉద్యోగి సగటున రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు సొమ్మును తన ఖాతాలోకి జమచేసుకొంటాడు. ఈ లెక్కన నెలకు రూ.5 కోట్లు సొమ్ము జమచేయబడుతుంది. నెలకు రూ.5 కోట్లు చొప్పున ఏడాదికి 60 కోట్లు రూపాయలు సొమ్ము చేయబడుతుంది. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.240 కోట్లు సొమ్ముకు జమాలెక్కలు లేకుండా పోయాయని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. గతంలో ఎన్నిసార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా బుట్టదాఖలాలు అయ్యాయే గానీ ఈ విషయం ముందుకు సాగలేదని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. బ్యాలెన్స్ షీట్ లేకపోవడంతో ఋణ దరఖాస్తులు పెట్టుకోవడం లేదు.

### బ్యాలెన్స్ షీట్లు అందించాలి



గత నాలుగేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్య నిధి ఖాతాలకు సంబంధించి బ్యాలెన్స్ షీట్లు పంపిణీ చేయడం లేదు. తమ ఖాతాల్లో ఎంత సొమ్ము జమ చేయబడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఖాతా నిర్వహణ సక్రమంగా జరగక పోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. సత్వరం పీఎఫ్ ఖాతాల నిర్వహణ ఆధునీకరించి బ్యాలెన్స్ షీట్లు అందజేయాలని కోరుతున్నాం.

- పువ్వుల ఆంజనేయులు
అధ్యక్షుడు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం, ఏలూరు జిల్లా

### భవిష్యనిధి ఖాతాల అప్డేషన్ జరుగుతుంది



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గల 48 మండలాల్లో 7,726 మంది ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల అప్‌డేషన్ కార్యక్రమం త్వరితగతిన జరుగుతుంది. మరో వారం.. పది రోజుల్లో బ్యాలెన్స్ షీట్లు ఆధునికీకరణ పూర్తికావస్తోంది. నూతన ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాలెన్స్ షీట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సీఎంఎఫ్ఎస్‌లో నమోదు చేసినటువంటి 41 పాక్షిక ఉపసంహరణలు, ఒక తాత్కాలిక ఋణములు, ఎనిమిది పదవీ విరమణ బిల్లులు మంజూరు చేశాం.

- కె.ఎస్.ఎస్.సుబ్బారావు
సీఈవో, జిల్లా పరిషత్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

**పీఎఫ్ ఖాతా సక్రమ నిర్వహణ నిల్..**

ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలు సక్రమ నిర్వహణ లేకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ మినహాయింపు సొమ్ము తమ ఖాతాలో ఉన్నదీ లేనిదీ తెలియక ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డు ఎక్కడానికి సిద్ధమవుతున్నారు పీఎఫ్ సొమ్ములో సవరణలు కూడా జరుగుతున్నదీ లేనిది తెలియక ఉద్యోగులు నష్టపోతున్నారు.

**రిటైర్డ్ ఉద్యోగికి దక్కని బ్యాలెన్స్ షీట్స్..**

ఈ ఏడాది పెద్దమొత్తంలో ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారు. పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు కూడా తమ భవిష్య నిధి ఖాతాల బ్యాలెన్స్ షీట్లు అందక తికమక పడుతున్నారు. తమ ఖాతా స్టేట్‌మెంట్ల కోసం పలుమార్లు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. లెక్కలు తేలక అధికారులు ఎంత సొమ్ము ఇస్తే అంతే తీసుకోవాల్సి వస్తోందని పదవీ విరమణ చేసే ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తా..

▸▸ కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరంటౌన్, జూన్ 13 : రెండు రోజుల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తానని భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో మావుళ్ళమ్మ అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకోగా అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వర శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరఫున ఈవో బుద్ద మహాలక్ష్మినగేష్ అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో భీమవరం వచ్చానని, పెద్దల నిర్ణయంతో బాధ్యత స్వీకరణ జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో ఒక కొత్త పరిశ్రమలు వచ్చిన సందర్భం లేదని అన్నారు. కేంద్రమంత్రి కుమార స్వామి సహకారంతో రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు.

## క్రైం కార్నర్

### లారీ ఢీకొని మహిళ మృతి

పాలకోడేరు, జూన్ 13: లారీ ఢీకొన్న ప్రమాదంలో పాలకోడేరు గ్రామానికి చెందిన మానేపల్లి పూర్ణ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం విస్సాకోడేరు లాకుల సమీపంలో చోటు చేసుకుంది. పాలకోడేరు గ్రామానికి చెందిన మానేపల్లి నాగేశ్వరరావు భార్య పూర్ణ కుమారుడు మానేపల్లి హర్షవర్ధన్ స్కూటీపై ఎక్కి విస్సాకోడేరు మీదుగా జిన్నూరు వెళ్తున్నారు. అదే సమయంలో లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మానేపల్లి పూర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. దీని పై కుమారుడు హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

### వ్యక్తి అనుమానాస్పద మృతి



శివనాగరాజు మృతదేహం

తణుకు, జూన్ 13 : ఉండ్రాజవరం మండలం తాడిపర్రుకు చెందిన గాజులపాటి శివనాగరాజు(25) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తేతలి గ్రామ పరిధిలోని బుధవారం రాత్రి జరిగింది. తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. పైడిపర్రులోని ఓ కర్మాగారంలో పనిచేస్తు న్నాడు. చివటం నుంచి తేతలి వెళ్లే రోడ్డులోని పంటబోదెలో పడి మృతి చెందాడు. బోదె గట్టు వద్ద మోటారు సైకిల్ ఉంది. స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి పంటబోదెలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆయనకు భార్య శిరీష, ఏడాదిన్నర బాబు ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరి మృతి

తణుకు, జూన్ 13 : మద్యం మత్తులో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మరణించిన ఘటన తణుకు మండలం దువ్వలో జరిగింది. తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి.. దువ్వ గ్రామంలో మద్యం దుకాణం వద్ద పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన భాస్కరావు(40), దువ్వకు చెందిన రామకృష్ణ మధ్య గురువారం గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ గాజు పెంకుతో భాస్కరరావును పొడవడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### ఆగిన లారీని ఢీ కొట్టిన బైక్.. వ్యక్తికి గాయాలు

ఉంగుటూరు, జూన్ 13 : ఆగి వున్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉంగుటూరు శివారు జాతీయ రహదారిపై గురువారం జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరు శివారులో కాలకృత్యాల నిమిత్తం లారీని ఆపిన సమయంలో భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (55) అనే వ్యక్తి కురెళ్లగూడెం నుంచి నిడదవోలుకు వెళుతున్న సమయంలో లారీ కుడివైపున ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు పోలీసులు తెలిపారు.

### మూడు మోటారు సైకిళ్లు చోరీ

ఉండి, జూన్ 13: ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తుల మోటారు సైకిళ్ల చోరీకి గురయ్యాయి. ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. మే ఏడో తేదీన ఉండి మండలం వాండ్రం గ్రామంలో వెల్‌కం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న చింతపల్లి దుర్గముఖేష్‌కు చెందిన బైక్.. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మంతెన ఉమామహేశ్వరరావు ఈనెల ఐదో తేదీన మోటారు సైకిల్ చోరీకి గురయింది. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వుమన్ కుట్టికి చెందిన బైక్ ఈనెల 12వ తేదీన చోరీకి గురయినట్టు పోలీసులు తెలిపారు. వీరి ముగ్గురు బైక్‌లు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో తస్కరణకు గురయినట్టు తెలిపారు. గురువారం ముగ్గురు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు విచ్చేసి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు, జూన్ 13: వ్యక్తి అదృశ్యంపై ముసునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పెదగర్ల సతీష్ ఈనెల ఆరో తేదీన ఉదయం పనికి వెళ్తున్నానని భార్యకి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటికి వరకు తిరిగిరాలేదు. గురువారం తండ్రి పెదగర్ల జయసుందరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## నడిరోడ్డుపై నిలిచిన ఆర్టీసీ అమరావతి బస్సు



ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

ఏలూరు క్రైం, జూన్ 13 : విశాఖపట్టణం నుంచి విజయవాడకు వెళ్తున్న అమరావతి ఏసీ బస్సు ఏలూరు నగరంలో ఆకస్మికంగా నడిరోడ్డుపై నిలిచిపోయింది. విశాఖపట్టణంలో గురువారం ఉదయం బయలుదేరిన ఈ బస్సు విజయవాడకు వెళ్లి తిరిగి విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్లాల్సి ఉంది. ఏలూరు నగరంలో ఫైర్‌స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్‌వైపు వెళ్తుండగా టూటౌన్ పోలీస్ స్టేషన్ ముందుకు వెళ్ళే సరికి ఆ బస్సు సాంకేతిక లోపం తలెత్తింది. ఈ నేపథ్యంలో డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును డివైడర్ మధ్య భాగంగా స్టేషన్ ముందు నిలిపారు. బస్సు వెళ్ళడానికి అవకాశం లేకపోవడంతో అలానే ఉంచి సంబంధిత ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. చివరకు గంటకు పైగా ప్రయాణికులు బస్సులోనే ఉండిపోయారు. ఏసీ బస్సు కావడంతో ఏసీ మాత్రం యథావిధిగా పనిచేసింది. చివరకు మరో బస్సు ద్వారా ప్రయాణికులను విజయవాడకు పంపించి వేశారు. బస్సు నడవడానికి సెన్సార్‌లో లోపం ఏర్పడిందని ప్రాథమికంగా డ్రైవర్ గుర్తించి సంబంధించి అధికారులకు తెలిపారు. ఈ బస్సు పరిజ్ఞానం సంబంధిత కంపెనీకి చెందిన ఇంజనీర్లు, టెక్నీషియన్లు వచ్చిన తరువాత గురువారం రాత్రి 9 గంటల తరువాత బస్సుకు మరమ్మతులు చేపట్టి తీసుకెళ్లారు.



లింగపాలెంలో అక్రమ మట్టి తోలకం పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

లింగపాలెం, జూన్ 13: మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు ప్రసాద్ హెచ్చరించారు. ధర్మాజీగూడెం గ్రామంలో రెండు రోజులుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఆ ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మట్టి తవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ సిబ్బందితో కలసి మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతం గుర్తించామన్నారు. చెరువులో మట్టి తవ్వకాలు జరిపి పక్కనే ఉన్న పొలాల్లో వేస్తున్నట్టు ఉండడంతో అక్రమ తవ్వకందారులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ మట్టి తోలకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగపాలెం మండలంలో అధికారుల అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరిపి అధిక ధరలకు అమ్ముతూ కొంతమంది అక్రమ అర్జనకు పాల్పడుతున్నారు. రెండు రోజులుగా మండలంలోని ధర్మాజీగూడెంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఆటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**తాటియాకులగూడెంలో..**

● జీలుగుమిల్లి : జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో రెండు రోజులుగా రాత్రి సమయంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. మట్టి తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేకున్నా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టి అక్రమ తవ్వకాలు జరిపి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై మట్టి తవ్వకం జరిపే వారిని అడగ్గా ఓ వీఆర్వోకు సంబంధించిన స్థలం మెరక చేసేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టే ప్రాంతంలో మట్టిని పోస్తున్నట్టు ట్రాక్టర్ల డ్రైవర్లు చెబుతున్నారు. ఈ విషయమై తాటియాకులగూడెం వీఆర్వో బుల్లి అబ్బులును వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు, తహసీల్దారు సైతం ఫోన్‌లో మాట్లాడేందుకు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది.

### పోక్సో కేసులో యువకుడికి జైలు

కలిదిండి, జూన్ 13:బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడు జైలు పాలయ్యాడు. మండలంలో పోతుమర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన యువకుడు నారగాని మణికంఠ ఓ బాలికపై 2021 జూన్ 10న లైంగిక వేధింపులకు పాల్పడడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఏ-1 ముద్దాయి నారగాని మణికంఠపై కేసు రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా మచిలీపట్నం 9వ అడిషనల్ జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వరరావు విధించారని కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

### ఆర్టీసీ బస్ ఢీకొని యువకుడికి గాయాలు

ఆగిరిపల్లి, జూన్ 13: అడవినెక్కలం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న సంపంగి ఈశ్వరరావు బైక్ మీద కాలేజీకి వస్తుండగా నూజివీడు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఆగిరిపల్లి ఎస్ఐ సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్డీఏ జెండా ధ్వంసం.. కేసు నమోదు



ఎన్డీయే జెండాను ధ్వంసం చేస్తున్న సర్పంచి భర్త మాన్‌సింగ్

భీమడోలు, జూన్ 13 : భీమడోలు మండలం అర్జావారిగూడెం గ్రామంలో సర్పంచ్ పాము సునీతమాన్‌సింగ్ కుటుంబం.. అదే ఇంట్లో నివాసం ఉండే ఆమె సోదరుడు అశ్వినీకుమార్ మధ్య ఇంటి విషయమై పాత వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 12వ తేదీన ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు సంఘీభావంగా అశ్వినీకుమార్ భార్య వారి ఇంటి వద్ద ఎన్డీఏ జెండాను ఎగురవేశారు. కోపగించిన సర్పంచి భర్త మాన్‌సింగ్ జెండాను ధ్వంసం చేసి అశ్వినీ కుమార్ దంపతులను కొట్టి గాయపరచగా భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కూటమి కార్యకర్తలను అవమాన పరిచేలా జెండాను ధ్వంసం చేశాడంటూ ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## కొత్తపాలెంలో వైసీపీ కార్యకర్తల దాడి

మొగల్తూరు, జూన్ 13: కొత్తపాలెంలో జనసేన కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు గురువారం దాడి చేసినట్టు తెలిసింది. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ రెండు ఫ్లెక్సీల మధ్యన ఉన్న ఖాళీ ప్రాంతంలో వైసీపీ వర్గీయులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి లీడర్ అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా జనసేన కార్యకర్త తాడి రవి సార్వత్రిక ఎన్నికల్లో జనసేన విజయానికి కృషి చేసినందుకు వైసీపీకి చెందిన పలువురు గురువారం సామూహిక దాడికి పాల్పడినట్టు బాధితుడు తెలిపారు.



మొక్కు తీర్చుకునేందుకు ద్వారకాతిరుమల వెళ్తున్న టీడీపీ నాయకులు

## శ్రీవారి క్షేత్రానికి కాలినడకన కూటమి నాయకులు

పోడూరు, జూన్ 13 : కూటమి కొలువు తీరి చంద్రబాబు సీఎం, పవన్ కల్యాణ్‌కు కీలక పదవి, నిమ్మల రామానాయుడు మంత్రి పదవి రావాలని కోరుతూ ఎన్నికల ముందు టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రానికి కాలినడకన వస్తామని పోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు మొక్కుకున్నారు. ఈమేరకు గురువారం మొక్కు తీర్చుకు నేందుకు కొమ్ముచిక్కాల నుంచి ద్వారకాతిరుమలకు కాలినడకన నాయకులు బయలుదేరి వెళ్లారు. ఎంపీటీసీ నాగరాజు సుజాత, పాలా నాగలక్ష్మి, మేడిశెట్టి బుజ్జి, యాళ్ల శ్రీను, గుడాల ప్రసాదుతో పాటు 50 మంది పాదయాత్రగా నడిచి వెళ్లారు.

## సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి

▸▸ పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

మొగల్తూరు, జూన్ 13 :గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన సంపద కేంద్రాలు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఆదేశించారు. గురువారం మొగల్తూరు ప్రధాన కాల్వ వెంబడి పేరుపోయిన చెత్తాచెదారాల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో కాల్వలు, నివాసాల మధ్య చెత్తకుప్పలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని 409 గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త తొలగింపు పనులు చేపట్టామన్నారు. పంచాయతీ సొంత నిధులు, 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకుని గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా శివారు ప్రాంతాల్లో డంప్ చేయాలన్నారు. పంచాయతీల పరిధిలో డంపింగ్ యార్డ్‌ల సమస్యపై వినతులు వస్తున్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి గంగన్న, ఉప సర్పంచ్ బోణం నరసింహరావు, వార్డు సభ్యులు మెట్ల రాంబాబు, ముక్కు గోపాలకృష్ణ తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

వేలేరుపాడు, జూన్ 13:టీడీపీ సీనియర్ కార్యకర్త ఆరే శ్రీనివాసరావు(54) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి బైక్‌పై విజయవాడ వెళ్లి తిరిగి వస్తున్న తరుణంలో తెలంగాణలోని అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామం మలుపు వద్ద గేదె అడ్డురావడంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అశ్వారావుపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ప్రమాదఘటన బుధవారం రాత్రి 9.30 గంటలకు జరగడంతో ప్రమాదంలో గాయపడింది ఎవరో తెలియకపోవడంతో సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేయడంతో వేలేరుపాడుకు చెందిన శ్రీనివాసరావు అని తెలిసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా నర్సారావుపేట చేరుకున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆయన మృతి చెందడం టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలచివేసింది. గురువారం ఉదయం పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించడంతో వేలేరుపాడులోని గృహానికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

## ప్రధానిని కలసిన గన్ని వీరాంజనేయులు



భీమడోలు, జూన్ 13 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు స్వాగతం పలికారు. ఆహ్వాన కమిటీలో సభ్యులైన గన్ని ప్రధాన మంత్రికి గౌరవ స్వాగతం తెలిపారు.

## రోడ్డు పక్కన హోటల్లో టీతాగిన ఎంపీ మహేష్



స్థానిక నేతలతో టీ తాగుతున్న మహేష్

చింతలపూడి, జూన్ 13: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ చింతలపూడిలో రోడ్డుపక్కన హోటల్‌లో కూర్చొని టీ తాగారు. గురువారం ఉదయం 6.30 గంటలకు తెలంగాణ వైపు వెళుతూ హోటల్ వద్ద ఆగారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అప్పటికప్పుడు శాలువా తెచ్చి ఎంపీని సన్మానించారు. బోడా అనీష్ కుమార్, సీహెచ్ అంకమరావు, సుమారు 50మంది కార్యకర్తలు ఉన్నారు.

## అచ్చెన్నాయుడిని కలసిన దాసరి శేషు



బుట్టాయగూడెం, జూన్ 13: పారదర్శక పాలనతో ప్రజలకు మేలు చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు చెప్పారని రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత విజయవాడలోని ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో అద్భుతమైన పాలన ప్రజలకు అందుతుందని మంత్రి తెలిపారన్నారు.

## అమెరికాలో తెలుగు వారి సంబరాలు



అమెరికాలో సంబరాలు చేస్తున్న తెలుగు వారు

ఏలూరు టూటౌన్, జూన్ 13: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో అమెరికాలో తెలుగు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని తెలుగు ప్రజలు అమెరికాలో టీవీల్లో తిలకిస్తూ సంబరాలు చేసుకున్నారు. పాములపర్తి భవాని ప్రసాద్, శ్రీవిద్య కావులూరి, వేమూరి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ, పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

## క్యాన్సర్‌ను గుర్తించేందుకు స్క్రీనింగ్ టెస్టులు

ఏలూరు క్రైం, జూన్ 13: ఏలూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మోహన్ కృష్ణ ప్రారంభించారు. జూలై 3 వరకు విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి ఎస్.శర్మిష్ఠ అన్నారు. దేశంలో క్యాన్సర్ కేసులు 34 శాతం ఉన్నాయన్నారు. 30 ఏళ్ల వయసు పైబడిన వారిని పరీక్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈనేపథ్యంలో ఎన్‌సిడి 3.0 స్క్రీనింగ్‌తో పాటు గ్రామాలలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా క్యాన్సర్ సర్వే జరుగుతుందన్నారు. అనుమానిత కేసులను దగ్గరలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య కళాశాలలు, ఏరియా ఆసుపత్రులకు రిఫర్ చేసి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం నాగేశ్వరరావు, ఎన్‌సీడీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కె.నరేంద్రకృష్ణ పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి : డీఎల్‌పీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

లింగపాలెం, జూన్ 13: గ్రామాల్లో వర్షాకాలం తాగునీరు క్లోరినేషన్ చేయాలని, పది రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని డీఎల్‌పీవో సుందరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందితో కలసి ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించాలన్నారు. వర్షాకాలం గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు నిల్వకుండా డ్రైనేజీలను తీయించాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో శానిటేషన్ చేయించాలని ఆమె తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రాంబాబు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎన్నికల' వీడియోగ్రాఫర్ల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద వీడియోగ్రాఫర్లు

చింతలపూడి, జూన్ 13: సాధారణ ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల విధులు నిర్వహించిన వీడియో గ్రాఫర్లకు బకాయిలు చెల్లించలేదు. పూర్తి పేమెంట్ ఇవ్వకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వారంతా నిరసన వ్యక్తం చేశారు. వీడియోగ్రాఫర్ కుమార్ మాట్లాడుతూ సుమారు 20 మంది వీడియో గ్రాఫర్లు ఎన్నికల విధుల్లో పనిచేశారని, కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చి మిగిలింది త్వరలో ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని కుమార్ పేర్కొన్నారు. నిరసన వ్యక్తం చేసిన తరువాత అక్కడి నుంచే తహసీల్దార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. రెండురోజుల క్రితమే పేమెంట్ వచ్చినట్లు తెలిసిందని వీడియోగ్రాఫర్లు తహసీల్దార్‌ను అడిగారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ అమౌంట్ వచ్చిందని, తాను సెలవులో ఉన్నానని రాగానే పరిష్కారం చేస్తానని చెప్పడంతో ఊరట చెందారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో నరేష్, ఆనంద్, చిన్నా, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.







ఏలూరు నగరంలో పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు, పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

# బడి గంట మోగింది

### పాఠశాలలు పునఃప్రారంభం

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పోలవరం మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుదీర్ఘ విరామానంతరం కలుసుకున్న విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఇటుకల కోట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, బోడిగూడెం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, చేగొండపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, పేద్రాల గిరిజన బాలుర ఉన్నత పాఠశాల, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పట్టిసీమ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోలవరం ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాలలో ప్రవేశాలు ప్రారంభించారు.

బుట్టాయగూడెం మండలంలో పలు పాఠశాలలను ఎంఈవో టి.బాబూరావు సందర్శించారు. పాఠశాలల్లో పరిశుభ్రతపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. రెడ్డిగణపవరం పాఠశాలల్లో పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ఆర్ఎస్‌వీ.శాస్త్రి, ఉపాధ్యాయురాలు సుమలత పాల్గొన్నారు.

కామవరపుకోట మండలంలో పాఠశాలలకు ఉపాధ్యాయ బృందం మామిడి తోరణాలు కట్టి పాఠాలను ప్రారంభించారు. 46 మండల పరిషత్ పాఠశాలలు, మూడు ఎంపియూపి పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కిట్‌లు పూర్తిస్థాయిలో సరపరా కానప్పటికీ వచ్చిన మేరకే సరఫరా చేశారు.

ఉంగుటూరు మండలంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉప్పాకపాడు ఫౌండేషన్ పాఠశాల హెచ్‌ఎం నక్కా సుధాకర్, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, ప్రీతీదేవి తదితరులు బడికి రాని వారి పిల్లల ఇళ్లకు వెళ్లారు. పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు.

పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా భీమడోలు హైస్కూలులో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని విద్యార్థులు పర్యావరణంపై సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- పోలవరం, బుట్టాయగూడెం, కామవరపుకోట, ఉంగుటూరు, భీమడోలు



పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు



రెడ్డిగణపవరం పాఠశాలలో హాజరు పరిశీలిస్తున్న ఎంఈవో



ఉప్పాకపాడులో పిల్లల ఇళ్లకు వెళ్లిన ఉపాధ్యాయులు



భీమడోలు హైస్కూలులో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## బాలికలకు ఉచిత క్రాష్ కోర్సు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 13: విద్యా సంవత్సరం ఆరంభం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని కృషిచేయాలని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ సూచించారు. కొత్తగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందిన బాలికలకు ఈ నెల 25 వరకు కళాశాల ప్రాంగణంలో స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ స్కిల్స్ క్రాష్‌కోర్సును గురువారం ఆమె ప్రారంభించారు. ఏలూరు, పరిసర ప్రాంతాల బాలికలు ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిలైన వారు ఉచిత క్రాష్ కోర్సును వినియోగించుకోవచ్చునన్నారు. వివరాలకు 99661 15229, 94909 70021 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శౌరీలు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## డీఎల్‌టీసీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 13: జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద మూడు నెలల వ్యవధితో కూడిన ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కోర్సులో ప్రభుత్వ ఐటీఐ (డీఎల్‌టీసీ)లో శిక్షణ ఇవ్వనున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ రవి తెలిపారు. పదో తరగతి, ఆ పైన విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. ఈ నెల 20లోపు దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 94934 82414 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## జిల్లాలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, జూన్ 13: నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీలు నిర్వహించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు.

## క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జూన్ 13: రజకుల క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రజక జనసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య విజ్ఞప్తి చేశారు. సంఘ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం, లక్కవరం రజకుల చెరువు సమస్యపై గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ అరసవల్లి రామును కలసి వినతిపత్రం అందించారు. ఉపాధి పథకంలో చెరువులను బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కె.కృష్ణ, విటాల శ్రీనివాస్, కె.మురళీ, జి.సత్యనారాయణ, దేవరపల్లి సుబ్బయ్య, జి.శ్రీనివాసరావు, శేషు, లక్ష్మీప్రసన్న, వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు హర్షణీయం

ఏలూరు టూటౌన్, జూన్ 13: ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు సంతకం చేయడంపై న్యాయవాది మురళి గొల్లపల్లి హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టం రద్దు కోరుతూ జిల్లా కోర్టు ఎదురుగా చేసిన న్యాయపోరాటం ఫలించిందన్నారు. మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. దీన్ని రద్దు చేయడంతో ప్రజల ఆస్తుల పరిరక్షణకు భరోసా ఉంటుందన్నారు.

## ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

బుట్టాయగూడెం, జూన్ 13: ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఏపీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ గురువారం మాట్లాడుతూ గిరిజన యువత కోసం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి ఏజెన్సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాలుగేళ్లుగా ఐటీడీఏ పరిధిలోని ఖాళీ పోస్టులు భర్తీకాక గిరిజన నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవో నెంబరు 3 చట్టబద్ధత కల్పించాలని ఎన్నికల్లో ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్సీతోపాటు ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీని తీయాలన్నారు.

## వృద్ధులపై వేధింపులు ఆపాలి

ఏలూరు టూటౌన్, జూన్ 13: వృద్ధులపై వేధింపులు ఆపాలని ఏపీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణరావు అన్నారు. ఈనెల 15న వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కన్నబిడ్డలే వేధింపులకు గురి చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వయోవృద్ధుల చట్టాలను సక్రమంగా అమలు చేస్తే ఇలాంటి వేధింపులు జరగవన్నారు. 2007 తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలన్నారు. జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి ప్రతీ మూడు నెలలకు సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతీ జిల్లాలో సబ్ డివిజనల్, అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి కాలపరిమితితో తీర్పు ఇవ్వాలన్నారు. వృద్ధుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ అవగాహన కోసం పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. రైలులో ప్రయాణంలో రాయితీలు పునరుద్ధరించాలన్నారు.

## సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్, జూన్ 13: వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఏనాడు పట్టించుకోలేదని, సంక్షేమ బోర్డును కూడా తీసివేసిందని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొజ్జా రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న సీఎం చంద్రబాబు హామీని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వానికి యూనియన్ తరఫున అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా 100 రోజుల్లో చంద్రన్న బీమా పథకం, భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంపై హర్షం ప్రకటించారు. కార్మికవర్గం తరఫున చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక క్లెయింలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నగరంలో రైతు కూలీ సంఘం ప్రదర్శన

ఏలూరు టూటౌన్, జూన్ 13: రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ వద్ద నుంచి కొత్తబస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వర్మ మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే రైతు మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.లలితకుమారి, షేక్ బాష, పాల్గొన్నారు.



మంత్రి పార్థసారథిని కలసిన నిడమర్రు నేతలు



ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరిస్తున్న ద్వారకా తిరుమల నేతలు



కుక్కునూరు నేతలను సత్కరించిన ఎంపీ పుట్టా

# మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు సత్కారం

నిడమర్రు, జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి తెలుగుదేశం మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వారిని మంత్రి సారథికి పరిచయం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, మహమ్మద్ గఫార్‌ఖాన్, పొత్తూరి నరసింహరాజు తదితరులు వరి, ఆక్వా రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

- కుక్కునూరు: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను సన్మానించడానికి వెళ్లిన టీడీపీ నాయకులనే ఎంపీ సత్కరించారు. ఎంపీగా గెలుపొందిన పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను కలవడానికి గురువారం కుక్కునూరు నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎంపీని ఘనంగా సన్మానించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణకు ఎంపీ శాలువా కప్పి సన్మానించారు. ఎన్నికల ప్రచారంలో భారీ ర్యాలీ నిర్వహించి టీడీపీ, కూటమి శ్రేణుల ద్వారా విజయానికి బాట వేశారని అభినందించారు. కృష్ణ, వెంకటరమణ, అప్పారావు, ఉదయ్, సందీప్ పాల్గొన్నారు.

### ఎంపీ మహేష్‌ను కలిసిన జిల్లా అధికారులు

ఏలూరు టూటౌన్: ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధా, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, ఎంఈ కొండ్రావు, ఉన్నారు. పశుసంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూబాబు సిబ్బంది ఎంపీ మహేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

### ఎమ్మెల్యే చంటికి బిషప్ జయరావు ఆశీస్సులు

ఏలూరు టూటౌన్: ఎమ్మెల్యే బడేటి చంటి ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేరను కలసి ఆశీస్సులు తీసుకున్నారు. బిషప్స్ హౌస్‌కు ఎమ్మెల్యే చంటి నాయకులతో కలసి వెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు మంచి సేవలందించాలని దీవించారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జుంజు మోజేష్, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్ పాల్గొన్నారు. తూర్పువీధిలో డ్రైఫ్రూట్స్ నూతన వ్యాపారాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. పూజారి నిరంజన్, టీడీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఏఎస్ఆర్ స్టేడియం మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బడేటి చంటిని సత్కరించారు. ఎం.అక్బర్, కె.మాధవరావు, ఎస్కే.సత్తార్, జంపా సూర్యనారాయణ, కె.నాగరాజు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. ఆదివారపుపేటలో సాయి ప్రేమ మందిరాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి కుటుంబ సమేతంగా సందర్శించారు. అర్చకులు, పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. సాయిబాబా జ్ఞాపికను, ప్రసాదాలు అందించారు.

### మద్దిపాటిని కలసిన మండల నేతలు

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును మండల నేతలు సత్కరించారు. నల్లజర్లలోని క్యాంపు కార్యాలయంలో స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందించారు. ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలసి శుభాకాంక్షలు తెలిపారు.

### టీడీపీ నేతల పాదయాత్ర

లింగపాలెం: తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామానికి చెందిన మరిడి రాంబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. వేంకటేశ్వరస్వామి మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్రగా వెళ్లారు. రాష్ట్రం అభివృద్ధిలో పయనించాలంటే చంద్రబాబే కావాలని ప్రజలు గుర్తించారని మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. కల్యాణంపాడులో ఆయన స్వీట్లు పంపిణీ చేశారు. బొంతు రాంబాబు, బొంతు శ్రీను, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్, అసిలేటి అశోక్, పొదిలి శౌరి పాల్గొన్నారు.

### చంద్రబాబు పాలనలో మెరుగైన సేవలు

కామవరపుకోట: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కేక్ కట్ చేశారు. తొలి ఐదు సంతకాల్లోనే ప్రజామోద పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తుందన్నారు. ఆయన వెంట గుంటుపల్లి, తాడిచర్ల, ఆడమిల్లి సర్పంచ్‌లు గోరింక దాసు, పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, ఎంపిటిసి కంఠమనేని పుష్పరాజ్యం, అంజిమూర్తి తదితరులు ఉన్నారు.

### రాష్ట్రంలో మొదలైన ప్రజా పాలన

ఏలూరు కార్పొరేషన్: చంద్రబాబు సీఎం కావడంతో గురువారం ప్రజాపరి పాలన ప్రారంభమైందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పల నాయుడు అన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఇచ్చిన హామీల అమలుకు చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, శ్రావణ గుప్త, బొత్స మధు, అల్లు సాయిచరణ్, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను, వీరంకి పండు తదితరులు ఉన్నారు.



పూర్తయిన సత్యసాయి పైపులైన్ మరమ్మతు పనులు

## సత్యసాయి పైపులైన్ మరమ్మతులు పూర్తి

పోలవరం, జూన్ 13 : మండలంలో కన్నాపురం అడ్డరోడ్డు నుంచి దొండపూడి మార్గంలో సత్యసాయి మంచినీటి పైపులైన్లు మరమ్మతులు పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం సత్యసాయి నీటి సరఫరా నిలిపివేయడంతో జిల్లాలో 13 మండలాల్లో సుమారు 200 గ్రామాలకు తాగునీరు అందడం లేదు. నాలుగుచోట్ల పగిలిపోయిన పైపులైన్ల స్థానంలో కొత్తపైపులు వేసి వెల్డింగ్ చేయడం ద్వారా మరమ్మతులు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు కాంట్రాక్టర్ సత్యనారాయణ తెలిపారు.

## సత్యసాయి కార్మికులకు జీతాల పంపిణీ

పోలవరం, జూన్ 13: సత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు ప్రస్తుతం ఒక నెల జీతాల బకాయి చెల్లించారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చేయకపోవడంతో కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాల బకాయిలు చెల్లించలేదని ఈ నెల 11న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. అధికారుల సూచనతో కాంట్రాక్టర్ ఒక నెల జీతం చెల్లించినట్లు కార్మికులు తెలిపారు. పిల్లల చదువులకు అదనపు ఖర్చులు కానున్నాయని, అధికారులు స్పందించి జీతాల బకాయిలు పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

## ఆన్‌లైన్ ద్వారానే ఎంప్లాయిమెంట్ సేవలు

బుట్టాయగూడెం, జూన్ 13: కేఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని ఉప ఉపాధి కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా సేవలను అందిస్తున్నట్లు ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజ తెలిపారు. విద్యావంతులైన గిరిజనులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ద్వారా తమ డేటాను కార్యాలయానికి పంపితే అధికారులు పరిశీలిస్తారని, తర్వాత ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఐటీడీఏ ఉప ఉపాధి కార్యాలయంలో ఇప్పటివరకు ఉన్న ఆఫ్‌లైన్ డేటాను ఆన్‌లైన్ డేటాలో అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఈ-సేవా కేంద్రాల ద్వారా కొత్తగా నమోదు, రెన్యువల్స్, అదనపు విద్యార్హతలు నమోదుకు వెబ్‌సైట్‌లో తమ విద్యార్హత పత్రాలు, ఆధార్ నెంబరు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఐడి నెంబర్లతో అప్‌లోడ్ చేయాలన్నారు. అర్హులైన గిరిజన విద్యావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కైకరంలో శతాధిక వృద్ధుడు లక్ష్మయ్య మృతి

ఉంగుటూరు, జూన్ 13: కైకరంలో శతాధిక వృద్ధుడు ముగ్గళ్ళ లక్ష్మయ్య (100) గురువారం మృతి చెందాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో ముగ్గురు ఉద్యోగులు కావడం విశేషం.

## విజన్ ఉన్న లీడర్ చంద్రబాబు నాయుడు

ఏలూరు టూటౌన్, జూన్ 13: విజన్ ఉన్న లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే బడేటి చంటి కొనియాడారు. శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లో యలమంచిలి నాగేశ్వర హరిశ్చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవాలు నిర్వహించారు. వై.రాజశేఖర్, వేమూరు సురేష్, వాసిరెడ్డి శేషగిరిరావు, కే.విజయలక్ష్మి, చిన్నా, రాకేష్, సురేష్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** సచివాలయ సెక్రటరీలు ఫీల్డ్‌వర్క్ చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సచివాలయ ఉద్యోగులతో సమావేశం జరిగింది. తాగునీరు, రోడ్లు, నూతన గృహాలు, మరుగుదొడ్లు, వీధిలైట్ల నిర్వహణ, తదితర సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత సెక్రటరీలపై ఉందన్నారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, ఎంఈ కొండలరావు, డీఏలు, ఏఈలు, ఎస్ఎంఆర్.పెదబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఆదివారపుపేట షిరిడీ సాయి ప్రేమమందిర్‌లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రివేళల్లో హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- **కామవరపుకోట :** సాయి మందిరాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణలను నిర్వహించారు. రామాలయం ప్రాంగణంలోని షిరిడీసాయి మందిర్, వాసవీ కన్యకాపరమేశ్వరి భక్త బృందం, తేలీల బజారులోని షిరిడీ సాయి మందిర్, కొత్తూరు షిరిడీసాయి మందిరం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు.
- **పోలవరం :** మండల పరిషత్ సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.శ్రీను గురువారం తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.
- **జీలుగుమిల్లి :** పి.రాజవరం గ్రామ సచివాలయానికి కూటమి నాయకులు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని అందజేశారు. సర్పంచ్ సోయం కాంతమ్మకు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. జాస్తి సత్యనారాయణ, గూడపాటి పుల్లయ్య, ఉండవల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.
- జీలుగుమిల్లిలో పసుపులేటి జయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కుమారుడు పసుపులేటి ప్రసాద్ కుటుంబీకుల్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి పలువురు కూటమి నాయకులు ఉన్నారు.
- **టి.నరసాపురం :** తిరుమలదేవిపేట షిర్డి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి బాబావారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.
- **భీమడోలు :** పత్రికా రంగంలో నూతన ఒరవడి తెచ్చిన రామోజీరావును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జనసేన నేత ప్రత్తి మదన్ అన్నారు. జనసేన పార్టీ నాయకులు రామోజీరావు మృతికి నివాళులర్పించారు. సినీ రంగంలో అనేక వేలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. రామ్మూర్తి, గణపతి, దుర్గా పల్లవి, నీలం అజయ్, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

ముదినేపల్లి, జూన్ 13 : గత ప్రభుత్వం అమలులోకి తీసుకురావాలనుకున్న ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైలు పై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడంతో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందర రామయ్య హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ యాక్టును రద్దు చేయటం అభినందనీయమన్నారు. దీంతో రైతుల భూ యాజమాన్య హక్కులను కాపాడినట్లయిందని పేర్కొంటూ ఈ యాక్టు నష్టాన్ని గమనించిన రైతులు ఎన్నికల్లో వైసీపీని ఓడించారని పేర్కొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు తీరతాయి

నూజివీడు, జూన్ 13: నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధికి క్యాబినెట్ మంత్రి హోదా ఇవ్వడంపై సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి హర్షం వ్యక్తం చేసింది. గతంలో నూజివీడు నుంచి మంత్రులుగా ఎమ్మార్ అప్పారావు, పాలడుగు వెంకట్రావు పనిచేశారు. ఆ తరువాత దీర్ఘకాలం అనంతరం ఇప్పుడు నూజివీడుకు మంత్రి పదవి దక్కడం హర్షణీయమన్నారు. సారధికి మంత్రి పదవి రావడం వల్ల నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల పథకం, త్వరిత గతిన పూర్తి కావడమే కాక నియోజకవర్గంలో పేదల సాగులో ఉన్న పదివేల ఎకరాల అటవీ, బంజరు భూములకు హక్కులు పొందేందుకు, నూజివీడు పట్టణ అభివృద్ధిలో భాగంగా రింగ్ రోడ్డు ఏర్పాటు, టిడ్కో ఇళ్ల పనులు పూర్తి అవ్వడానికి అవకాశం ఏర్పడుతుందని, సీపీఐ సీనియర్ నాయకులు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు చలసాని వెంకటరామారావు ఆశాభావం చేశారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

నూజివీడు, జూన్ 13: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్లస్టర్ కోఆర్డినేటర్ కె.శ్యామ్‌బాబు సారథ్యంలో నూజివీడు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. మొక్కలునాటి పరిసరాలను శుభ్రపరిచి, ప్లాస్టిక్ కవర్లను ఈ కార్యక్రమంలో తొలగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలను భారీగా పెంచాలని సూచించారు. చెట్లను నరికేటప్పుడు తప్పనిసరిగా మరో మొక్కను నాటాలని, ప్రతిఒక్కరూ పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థుల కు పిలుపునిచ్చారు. వర్షాలు కురవడంలో మొక్కలు ప్రాముఖ్యత పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అనురాధ, సువర్చల, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల తాళం పగులగొట్టిన అగంతకులు



పగులకొట్టిన పాఠశాల తాళం



ధ్వంసం చేసిన మరుగుదొడ్డి సామగ్రి

ముసునూరు, జూన్ 13: మండలంలోని గోపవరం ఎంపీపీ పాఠశాల తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి, లోపల ఉన్న మరుగుదొడ్డి సామగ్రిని ధ్వంసం చేశారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఉదయం ప్రధ్యానోపాధ్యాయిని పాఠశాల తాళాలు తీసేందుకు రాగా, గదికి వేసిన తాళం పగలకొట్టి ఉంది. లోపలకి వెళ్లి చూడగా సామగ్రి ధ్వంసం చేసి ఉంది. దీనిపై ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం అనురాధ చెప్పారు.

## సార్వా సాగుకు సమాయత్తం



ముదినేపల్లి ప్రాంతంలో సార్వా సాగు దుక్కు దున్నుతున్న పంట భూమి

ముదినేపల్లి, జూన్ 12 : సార్వా వరి సాగుకు రైతులు సమాయత్త మవుతున్నారు. పొలాల్లో వేసవి దుక్కులను పూర్తి చేసి భూములను సాగుకు సిద్ధం చేశారు. భూముల్లో సారం పెంచేందుకు పలు గ్రామాల్లో జీలుగ సాగు చేశారు. గత సార్వా సీజనులో భారీ వర్షాలు, తుపానుల కారణంగా వరి పంట పెద్ద ఎత్తున నష్టపోయిన రైతులు ఈ సార్వా సీజన్‌పై ఆశలు పెట్టుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. ముదినేపల్లి మండలంలో సుమారు 17 వేల ఎకరాల విస్తీర్ణంలో సార్వా వరి సాగు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన నారు మళ్లను కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ సార్వా సీజనులో రైతులు ఎక్కువగా నూతన వరి వంగడమైన 1318తో పాటు స్వర్ణ 1061 రకం వరి విత్తనాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అధిక ధాన్యం దిగుబడినిస్తున్న 1318 రకంపై రైతులు అధికంగా మక్కువ చూపిస్తున్నారు. వ్యవసాయ శాఖ కూడా 1318 రకం విత్తనాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. సుమారు 350 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపారు. విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

## కుళాయికి ట్యాప్ బిగించండి సారూ..



ములకలపల్లిలో వీధి కుళాయి నుంచి వృద్ధాగా పోతున్న తాగునీరు

ముదినేపల్లి, జూన్ 11 : రక్షిత నీటి పథకం వీధి కుళాయిల నుంచి నిరంతరం నీరు వస్తుండటంతో ముదినేపల్లి మండలం ములకలపల్లి గ్రామం మురికి కూపంలా తయారయిం ది. గ్రామంలో పలు చోట్ల కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే నీటి సరఫరాకు బ్రేక్ లేకుండాపోయింది. నీటి సరఫరా హెడ్ వద్ద నిలివేసినా బజారుపైపుల్లో నిల్వ ఉన్న నీరు పూర్తయ్యే వరకు కుళాయిల ద్వారా వస్తూనే ఉంటుంది. దీంతో కుళాయిల నుంచి వచ్చే నీరు రోడ్లపైకి వస్తున్నది. కుళాయిల వద్ద కూడ మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. వీధి కుళాయిలకు గతంలో ఐరన్ ట్యాప్‌లు పాడైపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ ట్యాప్‌లు బిగించారు. అవి కూడ పాడైపోయి వూడిపో యాయి. దీంతో కుళాయిల నుంచి వచ్చే నీరు వృథా అవుతుంది. చాలా కాలంగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

# భోజనం పెట్టేదెలా?

» నాలుగు నెలలుగా రాని బిల్లులు » అప్పుల పాలైన హాస్టల్ వార్డెన్లు » అరువు లేదంటున్న వ్యాపారులు



హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ముదినేపల్లి, జూన్ 13 : ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల నిర్వహణ దయనీయంగా మారింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో వసతి గృహాల నిర్వహణ బాధ్యత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల (వార్డెన్)లపై పడింది. దీంతో నాలుగు నెలలుగా వార్డెన్లు అప్పుల పాలై ఆర్థిక సమస్యలతో సతమతమవు తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకు భోజనం మెనూ అమలు చేసేందుకు, వసతి గృహాల నిర్వహణకు ఒక్కపైసా నిధులు మంజూరు చేయలేదు. పైగా కొత్తగా మెనూ విడుదల చేసింది. వసతి గృహాల్లో విద్యార్థులకు ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్‌తోపాటు రాత్రికి భోజనం అందించాల్సి ఉంది. ఆదివారంతోపాటు పాఠశాలలకు సెలవు రోజుల్లో కూడా వసతి గృహంలోనే భోజనం పెట్టాలి. ఇందుకు మూడు నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,400, కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబర్ వరకు విడుదలైన నిధులు, ఈ ఏడాది జనవరి నుంచి ఆగిపోయాయి. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 12 ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థుల భోజనం బిల్లులకు సంబంధించిన సుమారు రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉండిపోయాయి.

### అప్పుల పాలైన వార్డెన్లు

వసతిగృహాల విద్యార్థులకు భోజనం, టిఫిన్ సదుపా యాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. ఒక్కో వార్డెన్ సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు అప్పులైనట్లు సమాచారం. కొంతమంది వార్డెన్లు ఇళ్లల్లోని బంగారం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. కిరాణా, కూరగాయలు, పాల వ్యాపారులు వార్డెన్లపై పాత అప్పులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్త విద్యా సంవత్సరం గురువారం ప్రారంభమైంది. వార్డెన్లు అప్పుల పాలై చేతిలో సొమ్ము లేక సతమతమవుతున్నారు. వ్యాపారులు తిరిగి సరుకులను అరువు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఏం చేయాలో తెలియక వార్డెన్లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

### ట్యూటర్లకు జీతాల్లేవ్

గత 14 నెలలుగా వసతి గృహాల్లో ట్యూటర్లకు జీతాలు అందడం లేదు. నెలకు రూ.ఆరు వేల జీతమైనా కొంత మంది నిరుద్యోగులు ట్యూటర్లుగా చేరారు. జీతాలందని పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరంలో ట్యూటర్లు విధులకు వస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్ టాయ్‌లెట్స్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ లీలా కనకదుర్గ

కలిదిండి, జూన్ 13 : కోరుకొల్లులో ఎస్సీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులకు విన్నవించారు. గురువారం హాస్టల్‌ను సందర్శించి దోమల నివారణ మందును హాస్టల్ పరిసరాలలో చల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడడంతో వర్షపు నీరు లీకేజీ అవుతుందన్నారు. తాగునీటి పైపులు కూడా సక్రమంగా లేక మంచినీటి సమస్య ఉందన్నారు. టాయ్‌లెట్స్ అపరిశుభ్రంగా ఉన్నాయని, వాటికి తలుపులు ఊడిపోయాయన్నారు. పాఠశాలలు ప్రారంభమవ్వడంతో బాలికలు వస్తున్నారన్నారు. సంబంధిత ఉన్నతాధికారుల స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలన్నారు.

## ఆదర్శ గ్రామంగా పెదగొన్నూరు

» సినీ నిర్మాత సూచనతో ప్రణాళికలు » పాలకవర్గ సమావేశం నిర్ణయం



మంచి నీటి చెరువు నీటిని పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

ముదినేపల్లి, జూన్ 13 : ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు ఆ పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. సర్పంచ్ తాడంకి శిరీష అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సమావేశంలో పంచాయతీ ఏరియాలోని మంచినీటి చెరువులు, పశువుల చెరువులను అభివృద్ధి చేయాలని, విద్యుత్ లైన్లను ఆధునికీకరించాలని, తాగునీటి సౌకర్యం పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలను అమలు చేసేందుకు గ్రామ ప్రముఖులు, సినీ నిర్మాత డాక్టర్ కేఎల్ నారాయణ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. పంచాయతీ కార్యదర్శి గిరిజ, ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి శివప్రసాద్, టీడీపీ నాయకుడు గుడివాడ వేణు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రంగుమారిన మంచినీటి చెరువు నీటిని సర్పంచ్, కార్యదర్శి పరిశీలించారు.

## ట్రిపుల్ ఐటీ ఉద్యోగుల నిరసన

నూజివీడు, జూన్ 13: తమ జీతాలపెంపు కోరుతూ గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. 2010-14 మధ్య ఉద్యోగంలో చేరిన అధ్యాపకులకు ఆరేళ్లగా జీతాలు పెంచలేదన్నారు. ఐఐటీ, సెంట్రల్ యూనివర్శిటీ లాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుంచి అధ్యాపకులను ఎంపిక చేసి, వారి జీతాల పెంపు విషయంలో మాయ మాటలు చెబుతూ గత ఆరేళ్లగా ప్రభుత్వాలు మభ్యపెట్టాయని ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పడిన ఆర్జీయూకేటీకి ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేసి 110 జీవో తెచ్చి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో కలిపి జీతాలు పెంచకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల శాశ్వత నియామకాలకు సంబంధించిన రోస్టర్లు, డిపార్ట్‌మెంట్‌లను ఇష్టానుసారంగా కలిపివేసి ఉద్యోగులకు అన్యాయం చేశారన్నారు. 15 ఏళ్ల తరువాత కూడా శాశ్వత నియామకాలు లేకుండా సైన్స్, హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్‌లకు తీవ్రనష్టం జరిగిందని, గతంలో ఈ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా వ్యవహరించిన హేమచంద్రారెడ్డి ఈ సంస్థలోని అధ్యాపకులకు తీవ్ర నష్టాన్ని కలిగించారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి ల్యాబ్ అసిస్టెంట్‌లను, ల్యాబ్ టెక్నీషియన్‌లకు జీతాలు పెంచకుండా వేధిస్తున్నారన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల విషయంలో హైకోర్టు ఇన్‌టర్మ్ ఆర్డర్‌ను బేఖాతరు చేశారని, గత 15 ఏళ్ళ నుంచి పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని వీరు కోరుతూ గురువారం ఉదయం ఛాన్సలర్ కార్యాలయం ఎదుట ఛాన్సలర్ గోబ్యాక్ అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

# మంత్రి, ఎంపీలకు అభినందనల వెల్లువ



కైకలూరులో మంత్రి పార్థసారధిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి, కోకన్వీనర్ విజయలక్ష్మి



మంత్రి పార్థసారధిని సన్మానిస్తున్న ముసునూరు టీడీపీ నాయకులు

కైకలూరు, జూన్ 13: రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు కైకలూరు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరులో జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, తేరా రమేష్‌బాబు, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఇంత పెద్ద విజయాన్ని ప్రజలు కూటానికి అందించారని చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో అన్నిరకాలలోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. అలాగే కూటమి నాయకులను గెలిపించేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున ఓట్లు వేసి అత్యధిక మెజార్టీని అందించడంతో ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

• ముసునూరు : మంత్రి పదవిని దక్కించుకున్న కొలుసు పార్థసారధిని గురువారం విజయవాడలోని తాడిగడపలో ఉన్న పార్టీ కార్యాలయంలో ముసునూరు టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యాదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు, నాయకులు నల్లిబోయిన రాంబాబు పార్థసారధిని దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

# కూటమి శ్రేణుల సంబరాలు



పెంచికలమర్రులో కూటమి నేతలను సత్కరిస్తున్న గ్రామస్తులు



విశ్వనాద్రిపాలెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ముదినేపల్లి, జూన్ 13 : ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కాకరవాడలో టీడీపీ ఉపాధ్యక్షులు కొత్తూరు విఠల్ ఆధ్వర్యంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో విజయోత్సవం నిర్వహించారు. విశ్వనాద్రిపాలెంలో టీడీపీ మండల బీసీ సెల్ కార్యదర్శి వీరంకి చక్రపాణి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

• కైకలూరు : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడం రాష్ట్రానికి మంచి రోజులు వచ్చినట్లేనని నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. కైకలూరు మండలం పెంచికలమర్రు గ్రామంలో రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రామంలో కూటమి నాయకులు బీకేఎం నాని, కొల్లి వరప్రసాద్, పళ్లెం ఏడుకొండలులతో కలిసి గ్రామస్తులు సంబరాలను నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించగా మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రకాలుగాను కేంద్రంలో నరేంద్రమోదీ సహాయంతో విజయపథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జయమంగళ సుబ్బరాజు, జయమంగళ విజయకుమార్, ముంగర శ్రీను, ఘంటసాల నాగరాజు, ఘంటసాల సుబ్బరాజు, ఘంటసాల మల్లికార్జునరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ



ఉచిత శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రామారావు

కైకలూరు, జూన్ 13: మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు చేతివృత్తి ఎంతో దోహదపడుతుందని బైరెడ్డి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామారావు అన్నారు. కైకలూరు సత్యసాయి సేవా సమితిలో బ్యాంకర్ల గ్రామీణా, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మహిళలకు మగ్గం, జర్దోసిలో 37 రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బైరెడ్డి సంస్థ ద్వారా 2007 నుంచి ఇప్పటి వరకు వివిధ రంగాలలో సుమారు 50 వేల మందికి పైగా శిక్షణ పొంది ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. మరి కొంత మంది ఈ సంస్థల ద్వారానే ట్రైనర్లగా పని చేస్తున్నారన్నారు. శిక్షణ పొందే మహిళలకు సత్యసాయి సేవా సమితి ద్వారా ప్రతిరోజు ఉచితంగా మధ్యాహ్న భోజనాన్ని అందిస్తారన్నారు. శిక్షణ పొందిన వారికి ఇచ్చే సర్టిఫికెట్ల ద్వారా ఎటువంటి హామీ లేకుండా బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ డీవీఎస్ లోవ, ఏలూరు జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కె.శశిశేఖరరావు, మానవతా ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, వ్యాపారవేత్త సమయమంతుల పురుషోత్తం, డాక్టర్లు ఎం.సురేఖ, పి.జ్యోతిరాణి, రాష్ట్ర పురుష సేవా కో ఆర్డినేటర్ కొమరగిరి శ్యాంప్రసాద్, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ జి.శాంతి, రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కో ఆర్డినేటర్ జి.అమ్మాజీ, సేవా సమితి నిర్వాహకులు వీరప్ప, జీవీవీ కృష్ణమోహన్, ట్రైనర్ అనూష, ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం శ్యాంకుమార్, మండా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వంతెన శ్లాబ్ నిర్మిస్తాం



కూలిన వంతెనను పరిశీలిస్తున్న డీఈఈ విజయ శ్రీకర్

కలిదిండి, జూన్ 13 : పెదకొమ్మిలేరుపై కూలిన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్ అండ్‌బీ డీఈఈ విజయశ్రీకర్ అన్నారు. కూలిన పోతుమర్రు - కొండూరు వంతెనను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ కూలిన వంతెన సగ భాగాన్ని పూర్తిగా తొలగించి శాశ్వతంగా వంతెన శ్లాబ్ నిర్మిస్తామన్నారు. నాలుగు రోజుల్లో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ఆగిరిపల్లి, జూన్ 13: ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ఆగిరిపల్లి మండలంలో గురువారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభించారు. ఈ స్టాల్‌లో రసాయనాలు వాడని పసుపు బెల్లం కారం రెడ్‌రైస్ పీఎన్ఆర్ రైస్, వేరుశెనగ గుళ్ళు, ఆకు కూరలు లభిస్తాయని ఆగిరిపల్లి మండల ఇన్‌చార్జ్ అల్వానారాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## క్రైం సమాచారం

### పోక్సో కేసులో యువకుడికి జైలు

కలిదిండి, జూన్ 13 : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడు జైలు పాలయ్యాడు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు నారగాని మణికంఠ బాలికపై 2021 జూన్ 10న లైంగిక వేధింపులకు పాల్పడడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నారగాని మణికంఠపై కేసు రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా మచిలీపట్నం 9వ అడిషనల్ జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వరరావు విధించారని కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

### ఆర్టీసీ బస్ ఢీకొని యువకుడికి గాయాలు

ఆగిరిపల్లి, జూన్ 13: అడవినెక్కలం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న సంపంగి ఈశ్వరరావు బైక్ మీద కాలేజీకి వస్తుండగా నూజివీడు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఆగిరిపల్లి ఎస్ఐ సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు, జూన్ 13: వ్యక్తి అదృశ్యంపై ముసునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పెదగర్ల సతీష్(32) ఈ నెల ఆరో తేదీన ఉదయం పనికి వెళ్లుతున్నాని భార్యకి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటికి వరకు తిరిగిరాలేదు. సతీష్ కోసం బంధువులు వెతుకులాడినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో గురువారం తండ్రి పెదగర్ల జయసుందరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వ్యక్తికి గాయాలు

ముదినేపల్లి, జూన్ 13 : స్కూలు బస్సుల విషయంలో తలెత్తిన వివాదంలో ఓ యువకుడు గాయాలపాలై ఆసుపత్రిలో చేరిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూలుకు చెందిన బస్సులు ఆ విద్యా సంస్థ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరు మీద చాలా కాలంగా నడుపుతున్నారు. ఆ సొసైటీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న చిట్టూరి నితిన్‌ను బస్సులను తమకు అప్పగించాలని స్కూలు తరపున బి.సాయి సుమంత్ ఈ నెల 12న అడగా, ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. బస్సులు అప్పగించేందుకు తాను అంగీకరించకపోవడంతో సుమంత్ తనను కొట్టి గాయపర్చాడని నితిన్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులకు వరి విత్తనాల పంపిణీ



మండవల్లిలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు



తామరకొల్లులో రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న వ్యసాయాధికారులు

కైకలూరు, జూన్ 13: సార్వా సాగులో రైతులు విత్తన శుద్ధి చేసి విత్తనాలు వేసే ముందు మొలక శాతం కట్టుకోవాలని ఏలూరు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎం.ఉషారాణి సూచించారు. వింజరం, తామరకొల్లు గ్రామాల్లో గురువారం సబ్సిడీపై ఎంటీయూ-7029, ఎంటీయూ-1318 వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిలో వరి విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బండెజిమ్ కలిపి 24 గంటల పాటు ఉంచి విత్తనాలను చల్లు కోవాలన్నారు. దీనివల్ల తెగుళ్ళు, పురుగుల నుంచి పంటకు రక్షణ కలుగుతుందన్నారు. కైకలూరు వ్యవసాయ శాఖ ఏడీఏ మాట్లాడుతూ ముంపు ప్రాంతం, చవుడు నేలలు అధికంగా ఉన్నందున వాటిని తట్టుకునేందుకు వరి వంగడాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్య, వీఏఏలు పాల్గొన్నారు.

• మండవల్లి : సార్వా సాగు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ జి.వెంకటమణి తెలిపారు. గురువారం మండవల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై వరివిత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కేజీ రూ.5లు చొప్పున సబ్సిడీపై 30 కేజీలు రూ.150లకు విత్తనాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, 1318 రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వరి విత్తనాలు కావాలనుకునేవారు మండలంలోని కానుకొల్లు, పెరికేగూడెం, గన్నవరం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఎలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి షేక్ జరీనా, వీఏఏ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు పునఃప్రారంభం



వేల్పుచర్లలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



ముదినేపల్లి మండలం పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

ముదినేపల్లి, జూన్ 13 : వేసవి సెలవులు అనంతరం ప్రభుత్వ పాఠశాలలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల కోలాహలం కనిపించగా, ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే ఉంది. ముదినేపల్లి మండలంలోని 54 ఎలిమెంటరీ, యూపీ, ఎనిమిది జడ్పీ హైస్కూళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. విద్యార్థులకు యూనిఫాం, బెల్టులు, బూట్లు అందలేదు. పాఠ్యపుస్తకాలు మాత్రం 70 నుంచి 80 శాతం అందాయి. పాత యూనిఫాంతోనే కొత్త విద్యా సంవత్సరంలోని విద్యార్థులు అడుగు పెట్టారు.

• కైకలూరు : పాఠశాల ప్రారంభం నాటికే కైకలూరు మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలలకుగాను పుస్తకాలు 36,711 రావాల్సి ఉండగా 31,695 పుస్తకాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేశారు. ఇంకా 5,016 పుస్తకాలు, షూస్, యూనిఫాంలు, బ్యాగ్‌లు రావాల్సి ఉంది. ఈ పుస్తకాలను కైకలూరు ఉరూ పాఠశాల నుంచి మండలంలోని అన్ని స్కూల్స్‌కు ఎంఈఓ-2 వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తరలించారు. మండలంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 40 ప్రైమరీ స్కూళ్ళు, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 11 యూపీ స్కూళ్ళు, తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూళ్ళు ఉన్నాయి. వీటిలో 262 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

• ముసునూరు : వేసవి సెలవుల అనంతరం నూతన విద్యాసంవత్సరాన పండుగ వాతావరణంలో మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలల్లో మామిడి తోరణాలు, అరటిపిలకలు కట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికి ఈ విద్యాసంవత్సరంలో అన్నిరంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మండల వ్యాప్తంగా జడ్పీ పాఠశాలలు ఎనిమిది, ఎంపీయూపీ పాఠశాలలు ఎనిమిది, ఎంపీపీ పాఠశాలలు 47 ఉండగా మొత్తం 3,950 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందుబాటులో ఉంచామని, అలాగే స్టూడెంట్ కిట్స్‌ను త్వరలో ప్రతి విద్యార్థికి అందజేస్తామని ఎంఈవో టీవీఎస్ సుబ్బారావు తెలిపారు.